
# మైనం కరిగింది

— ఎం.డి.రహమాన్



సాయంత్రం ఆరు గంటలు కావస్తోంది.

డిసెంబర్ నెల కావటం చేత చలి రక్కసి అప్పటికే ఒళ్ళు విరుచుకుని వీర విహారం చేస్తోంది.

డాబాపై నిల్చుని శూన్యంలోకి చూస్తూ ఆలోచిస్తున్నాను.

ఆకాశంలో పక్షులు ఎగురుతూ గూళ్ళు వైపు వెళ్తున్నాయి.

"ఏమండీ!"

పిడుగులా పిల్చింది నా శ్రీమతి కల్పన.

అందమైన ఆ సాయంత్రంలో, ఆహ్లాదకరమైన ఆ వాతావరణంలో ఆ పిలుపు వినిపించి వినిపించనట్టుగానే అనిపించింది. అందుకే బదులివ్వలేకపోయాను.

"పిలిస్తే వినిపించడం లేదా? మిమ్మల్నే" మళ్ళీ పిల్చింది.

"ఆ...ఆ... వస్తున్నాను. ఏమిటీ?" అంటూ కిందికి నడిచాను.

"ఏమిటోయ్ ఎందుకు పిలిచావు?" అడిగాను దగ్గరకు వెళ్ళి.

"ఈ నెల జీతం" అంటూ ఆమె ఇంకేదో చెప్పబోయింది.

"ఒట్టు ఒక్క రూపాయి కూడా దాచుకోలేదు. వచ్చిన జీతం మొత్తం ఆఫీసు నుంచి రాగానే నీ చేతుల్లో పెట్టేశాను" వెంటనే చెప్పాను.

నవ్వింది కల్పన.

నాకేం అర్థం కాక అమాయకంగా ఆమె మొహంలోకి చూశాను.

"నేనడిగింది అది కాదండీ" అంది కల్పన.

"కాదా... అయితే మరేమిటి?" అడిగాను.

"ఈ నెల జీతంలో వెయ్యి రూపాయలు మిగిలాయి" అందామె.

"మిగిలాయా? మరోసారి చూడు. సరుకులు తేకపోవడమో, కిరాణా షాపువాడికో, పాలవాడికో డబ్బులు ఇవ్వలేదేమో చూడు" అన్నాను.

"అంతా చూశానండీ ఎవరికీ నెలలో బాకీ పడలేదండీ" అంది కల్పన.

"మళ్ళీ చూస్తే బాగుంటుందేమో" అన్నాను.

"లేదండీ" ఖండితంగా చెప్పింది కల్పన.

అయితే ఈ నెలలో ఖర్చు తగ్గిందన్నమాట. ఇలాగే ప్రతి నెల పొదుపు చేస్తే సంవత్సరానికి పన్నెండు వేలు మిగులుతాయి. సంతోషంగా లెక్కలు వేయసాగాను.

"అందుకే..." అంటూ కల్పన ఏదో చెప్పబోయి ఆగిపోయింది.

"అందుకే... ఏమిటో చెప్పు?" ఉత్సాహంగా అడిగాను. పొదుపు చేయటానికి ఏమేం చెబుతుందోనని ఆసక్తిగా ఆమె వైపు చూశాను.

"ఈ నెల వెయ్యి రూపాయలు మిగిలాయి కదా. వచ్చే నెలలో మరో వెయ్యి మిగులుతాయి కదా?"

"అవును కదా నువ్వు చెప్పేదేదో సూటిగా చెప్పవచ్చు కదా" అంటూ ఆమె మొహంలోకి చూశాను. ఆనందంతో వెయ్యి ఓల్టేజి బల్బులా వెలిగిపోతుంది.

"నేను చెప్పేది మీరు వినటం లేదు. ఎగతాళి చేస్తున్నారు" బుంగమూతి పెట్టి చిన్న పిల్లలా అంది.

ఇందాకే ఆమె మొహం ఆనందంతో వెలిగిపోయింది. మళ్ళీ బుంగమూతి పెట్టింది. మొత్తానికి ఆమేదో ట్రిక్ ప్లే చేస్తుందని అర్థమైంది.

"వింటున్నా కదా. ఈ నెలలో వెయ్యి, వచ్చే నెలలో వెయ్యి మిగులుతాయి. మొత్తం కలిపితే రెండు వేలు" అన్నాను.

"మన పెళ్ళి రోజు ఎప్పుడూ?" నవ్వుతూ గోముగా అంది.

నాకేదేదో అర్థమౌతుంది.

"జూన్ 28".

"రొటీన్‌గా మన పెళ్ళి రోజు ఇక్కడ కాక వేరే ఎక్కడైనా ఆనందంగా గడుపుదాం. జీవితంలో తీయని గుర్తుగా మిలిగిపోతుంది. ఏమంటారు?" గోముగా అంది.

పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడ్డాను. నేను ముందే అనుకున్నాను. ఇలాంటిదేదో ఉంటుందని. తెలివైన ప్లానుకి పంచదార పూత పూసింది.

కాదు ... కుదరదంటే... పక్కంటి పాకీజా, ఎదురింటి వనజా వాళ్ళు, వాళ్ళ పెళ్ళి రోజులకి నెక్లెస్ కొన్నారు, పదహారువేల రూపాయల పట్టుచీర కొన్నారు అంటూ మొత్తం లిస్టు చదివినిపిస్తుంది.

ఏం మాట్లాడక 'సరే' అన్నాను.

"మా ఆయన బంగారం" అంటూ ప్రేమ ఒలకబోయసాగింది.

"వెండేం కాదు" అన్నాను పళ్ళన్నీ కనిపించేలా జీవంలేని ఓ నవ్వు నవ్వి.

"చాల్లెండి మీ జోకులు" అంటూ వెళ్ళిపోయింది.

ఆమె వంటింట్లోకి వెళ్ళేదాకా అలాగే చూస్తూ నిల్చున్నాను శిలలా.

* * *

రోజులు గడిచాయి. మా పెళ్లి రోజు రానే వచ్చింది. ఇంకా రెండ్రోజులు ఉంది.

నా శ్రీమతి హడావుడి అంతా ఇంతా కాదు. ఆమె మాట ప్రకారమే ఓ నాల్రోజుల పాటు ఆఫీసుకు సెలవుపెట్టాను.

అప్పటినుంచే పెళ్ళిరోజు ఎక్కడా, ఏ హోటల్‌లో, ఎలా జరుపుకుందామంటూ ఉక్కిరిబిక్కిరి చెయ్యసాగింది.

"నువ్వే చెప్పు ఎక్కడికెళ్దాం?" చివరికి నేనే అడిగాను.

"కాశ్మీర్ కెళ్దామా?" సంతోషంగా అంది కల్పన.

"ఎందుకు... ఇక్కడ చలి తక్కువవుందని అక్కడికెళ్ళి ఐసులా అయిపోదామనుకుంటున్నావా?" అన్నాను.

లోలోపల ఎంతో కోపంగా ఉంది. చిరాగ్గా ఉంది. అవిగాని ఆమె ముందు బయటపెడితే, మూతిని ముప్పైసార్లు తిప్పి వెంటనే నిరసన తెలుపుతుంది. అంతే వారం రోజుల పాటు పుడ్డుకు, బెడ్డుకు దూరం అయిపోతాను.

కల్పన ఆలోచిస్తోంది.

"పోనీ ఆగ్రా వెళ్దామా?" అన్నాను.

"సరే" అంటూ వెంటనే సంతోషంగా ఒప్పుకుంది.

ఎలా వెళ్లాలో, ఏ టైముకు బయలుదేరాలో, ఏమేం తీసుకెళ్లాలో మొత్తం మాట్లాడుకున్నాం.

"అవును మన దగ్గరున్నది రెండు వేలే కదా? అవి సరిపోతాయా?"

"అవి సరిపోవని నాకు ముందే తెలుసు. అందుకే పార్వతమ్మ దగ్గర అప్పు తీసుకున్నాను" వెంటనే చెప్పింది.

"అప్పా?" నోరు తెరిచాను.

"అప్పు కాకుంటే ఊరికే ఇస్తారా ఎవరైనా. వడ్డీ తీసుకోనందుకు సంతోషించండి. నిదానంగా తీర్చొచ్చు. మీరేం భయపడకండి" అన్నీ తెలిసిన దానిలా అంది కల్పన.

అప్పు తీసుకుని మరీ వెళ్లాలంటే ఎందుకో మనసు ఒప్పుకోవడం లేదు. కానీ కల్పన ముందు ఏం చెప్పలేకపోయాను.

మర్నాడే బయలుదేరాము ఆగ్రాకు.


రాత్రి ఎనిమిది కావస్తోంది. ప్లాట్‌ఫాంపై నిల్చున్నాము.

చలి భరించలేనంతగా ఉంది. చల్లని ఈదురుగాలి ఒంటికి తాకగానే జ్వరం వచ్చిన వాడిలా వణికిపోతున్నాను.

కల్పన కూడా చలికి తట్టుకోలేకపోతోంది. శాలువాని ఒంటి నిండా కప్పుకున్నా ఒణుకుతోంది.

సిగరెట్ వెలిగించాను. పొగ వేడిగా గుండెలకు తాకింది. తృప్తిగా ఫీలయ్యాను.

మరో దమ్ములాగించి, పొగని గాల్లోకి వదులుతూ కల్పన వైపు చూశాను. ఆమె ఈ లోకంలో లేనట్టు ఎటో చూస్తుంది.






**"కిర్సనాయిల్ వ్యాపారి" ఎవరితో "తగవు" పెట్టుకోడు?**

"అగ్గి పెట్టెల ఫ్యాక్టరీ" యజమానితో!

* * *

**"రాజు" - "పేద" తేడా ఏమిటి?**

"ఆహా" - "అయ్యో!"

* * *

**"వరకట్నం"పై కొత్త "స్లోగన్"?**

కట్నం వలదన్నవాడు "నరుడు!" వలయునన్నవాడు "వానరుడు"

* * *

**బస్‌లలో "దేవుని స్మరింపుము" అని బోర్డులు పెడతారెందుకు?**

బహుశా అదే మన "ఆఖరి ప్రయాణం" కావచ్చేమోనని!

* * *

**మనం సాధించిన "ప్రగతి" ఏమిటి?**

ఒకప్పుడు "పావలా" వుండే "డ్రింక్" నేడు పది రూపాయలకు పెంచడం!

* * *

**స్త్రీల మెళ్ళో "నగలు" దేనికి?**

దొంగలు త్రెంపుకు పోయి బ్రతకడానికి!

* * *

**ఇంట్లో "నుయ్యి" ఎందుకు?**

కోడళ్ళు "విముక్తి"పొందడానికి!

* * *

**సినిమాలకు "పబ్లిసిటీ" ఎందుకు?**

"మొదటి ఆటకే" "డబ్బాలు" తిరిగి రాకుండా వుండేందుకు!

* * *

**పార్టీకి "గుర్తు" దేనికి?**

నెగ్గితే ఊరేగించడానికి!

* * *

**పెళ్ళికి "భోజనాలు" పెట్టడం దేనికోసం?**

మ్రింగేసి, ఎంతోకొంత చదివించి అఘోరిస్తారని!

"కల్పనా? ఏమిటి ఆలోచిస్తున్నావు?" మృదువుగా అడిగాను.

"ఒక్కసారి అటు వైపు చూడండి" అంటూ తను చూస్తున్న వైపు చూపించింది.

నా దృష్టి మరల్చాను. అక్కడ నలుగురు పిల్లలు ఒంటి మీద దుస్తులు లేకుండా పడుకొని ఉన్నారు. చలిని భరించలేక కాళ్ళు, చేతులు పొత్తి కడుపులోకి ముడుచుకుని పడుకున్నారు.

"నువ్వు చూపిస్తున్నది ఆ పసివాళ్ళనేనా?"

"అవును" అంది.

"అయితే..."

"ఆ పసి మొగ్గలని చూస్తే మీకేమనిపించడం లేదా?"

ఆమె చెబుతున్నదేమిటో నాకేం అర్థం కాలేదు.

"ఆ పసివాళ్ళు చలితో ఎలా ఒణికిపోతున్నారో చూస్తున్నారా?" కల్పన గొంతు బాధతో పూడుకుపోయింది.

"అవును. పాపం వాళ్ళు అనాధలు" బాధపడుతూ అన్నాను.

ఎప్పుడో, ఎక్కడో ఆడవాళ్ళు మోసపోయి కనిపారేసిన పసిడి మొగ్గలు వాళ్ళు.

క్షణికావేశంతో కాలు జారినవాళ్ళు, ఒక నిండు ప్రాణిని కని రోడ్డు మీద పారేసి, వాళ్ళు చేసిన తప్పుకు ఈ పసివాళ్ళు శిక్ష అనుభవిస్తున్నారు. అనాధలయ్యారు.

"పాపం కప్పుకోవడానికి ఏం లేక ఎలా బిగుసుకుపోయారో".

"ఒంటి మీద చొక్కా కూడా లేదు".

"ఏమండీ".

ఏమిటన్నట్టు చూశాను.

"మన ప్రయాణాన్ని కాన్సిల్ చేద్దామా?" అంది.

"ఎందుకు?"

"మనకు పిల్లలు లేరు. కాని మాతృత్వం అంటే ఏమిటో నాకు తెలుసు. ఒక తల్లిగా వాళ్ళని ఆదుకోవాలని ఉంది" ఒక్క క్షణం సేపు ఆగి నా వైపు చూసి మళ్ళీ అంది.

"మన దగ్గరున్న డబ్బులు వాళ్ళకిచ్చి ఒంటికి బట్టలు కొనుక్కోమందాం. కొంతలో కొంతైనా సాయపడదాం."

నేనేం మాట్లాడలేదు.

"ఈ జీవితంలో ఈ ఒక్క మంచి పని చేశామనే తృప్తి మనకు మిగులుతుంది. పెళ్ళి రోజులంటూ, పుట్టిన రోజులంటూ వేలకు వేలు డబ్బు వృధా చేయడం కన్నా ఇలాంటి అనాధలకు సహాయపడటంలో ఎంతో తృప్తి ఉంది. నిజమైన ఆనందం ఉంది. మనం చేసే వృధా ఖర్చుల్లోంచి కొంతైనా వీరికి సహాయపడితే దేశంలో అసలు అనాధలనే వారే ఉండరు".

ఆమె అంటుంటే నేను చలించిపోయాను.

"ఇకనుండి నగలంటూ, పట్టుచీరలంటూ డబ్బు వృధా చేయనండీ. ప్రతి పెళ్ళి రోజున ఇలా ఓ నల్గురికైనా సహాయపడదాం. పట్టుచీర కట్టుకోవడం కన్నా పాత చీర కట్టుకుంటేనే నిజమైన ఆనందం, తృప్తి ఉంటుందని ఇప్పుడు తెల్సుకున్నాను." అంటూ కల్పన ఆ పసివాళ్ళ వైపు నడిచింది.

ఆడవాళ్ళ మనసు ఎలాంటిదో నాకర్థమైంది. మైనం ఎప్పటికైనా కరుగుతుంది. కల్పన మరోసారి అది నిజమని రుజువు చేసింది.